క్లుప్తంగా

అంగరంగ వైభవంగా వెంకన్న రథోత్సవం



బందారులంకలో నిర్వహిస్తున్న వెంకన్న రథోత్సవం

అమలాపురం రూరల్: మండలంలోని బందారులంక పద్మావతి అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా స్వామి వారి రథోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా సాగింది. ప్రత్యేకంగా అలంకరించిన శేషవాహనంపై స్వామి, అమ్మవార్లను ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. బిళ్ల వారి వీధి నుంచి ఎగ్జిబిషన్ వీధి, వీరభద్ర స్వామి గుడి సెంటర్, హైస్కూల్ సెంటర్, మురుగులమ్మ గుడి సెంటర్ మీదుగా శివాలయం వీధి వరకూ రథోత్సవం సాగింది. దారి పొడవునా మహిళలు మంగళ హారతులు పట్టారు. రథోత్సవంలో శక్తివేషాలు, స్వామి, అమ్మవార్ల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

పద కవితా పితామహుడు అన్నమయ్య

అమలాపురం టౌన్: తెలుగు సాహిత్య చరిత్రలో ప్రథమ వాగ్గేయకారుడు అన్నమయ్య ఎందరో కీర్తనాచార్యులకు మార్గదర్శకుడిగా నిలిచారని మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు అన్నారు. స్థానిక భూపయ్య అగ్రహారంలో సాయి సంజీవిని వాకర్స్ యోగ ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన అన్నమయ్య జయంతి సభలో నానిరాజు మాట్లాడారు. తొలుత అన్నమయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కవి నల్లా నరసింహమూర్తి, కవి బీవీవీ సత్యనారాయణ, బుర్రకథ కళాకారుడు కడలి సత్యనారాయణ, సీహెచ్ సర్వారాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పాలిటెక్నిక్ ఉచిత శిక్షణ తరగతులు



ఉచిత శిక్షణ పొందిన విద్యార్థులతో ఏబీవీపీ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురంలో పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఏబీవీపీ 14 రోజులుగా 125 మంది విద్యార్థులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. స్థానిక సర్ సీవీ రామన్ స్కూలులో జరిగిన శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా సంఘటనా కార్యదర్శి కంటేపల్లి నరేంద్రరెడ్డి మాట్లాడుతూ ఉచిత శిక్షణ పొందిన విద్యార్థులంతా పాలిటెక్నిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు, స్కూలు ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఏబీవీపీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కొత్తలంకలో ఉచిత వైద్య శిబిరం

ముమ్మిడివరం: మండలంలోని కొత్తలంకలో మంగళవారం పిల్లల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జనసేన నాయకుడు పితాని బాలకృష్ణ శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జక్కంశెట్టి పండు, గొలకోటి వెంకన్నబాబు, కదలి కొండ, పితాని రాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు దేవగుప్తం విద్యార్థి



తాడి గణేష్

అల్లవరం: అల్లవరం మండలం దేవగుప్తం ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న తాడి గణేష్ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ వాలీబాల్ క్రీడలకు ఎంపికయ్యారని పీడీ అప్పారి త్రిమూర్తులు మంగళవారం తెలిపారు. రావులపాలెంలో జరిగిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సబ్ జూనియర్ వాలీబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచాడని తెలిపారు. ఈ నెల 14న రాజమహేంద్రవరంలో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటాడన్నారు. విద్యార్థి గణేష్‌ను హెచ్ఎం వెంకటరమణ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

యూడీసీ పదోన్నతికి పరీక్ష

యానాం: వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 92 అప్పర్ డివిజనల్ క్లర్క్(యూడీసీ) ఉద్యోగాలను లిమిటెడ్ డిపార్ట్‌మెంటల్ కాంపిటీటివ్ ఎగ్జామ్ ద్వారా అర్హులైన ఎల్‌డీసీలతో భర్తీ చేయడానికి మంగళవారం పుదుచ్చేరి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. ఎల్‌డీసీలుగా లెవెల్–2 పే అందుకుంటూ కనీసం నాలుగేళ్ల రెగ్యులర్ సర్వీసుతో పాటు అకౌంట్స్ టెస్ట్ ఫర్ సబార్డినేట్ ఆఫీసర్స్ టెస్ట్, మినిస్టీరియల్ స్టాఫ్ కామన్ జనరల్ డిపార్ట్‌మెంటల్ టెస్ట్‌లు పాసై ఉండాలన్నారు. మొత్తంగా 92 పోస్టులను రిజర్వేషన్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నారని అభ్యర్థులు జూన్ 2లోగా దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

వెనకబడకుండా ప్రత్యేక తరగతులు

- పదో తరగతి సప్లిమెంటరీ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణనిస్తున్న ఉపాధ్యాయులు



తాళ్లరేవు హైస్కూల్‌లో టెన్త్ సప్లిమెంటరీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

తాళ్లరేవు: పదో తరగతి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. విద్యార్థులు తమ తోటివారితో కలిసి ఇంటర్మీడియట్‌లో చేరాలంటే సప్లిమెంటరీ పరీక్షల్లో పాసవ్వడం తప్పనిసరి. లేదంటే ఏకంగా విద్యా సంవత్సరాన్ని కోల్పోయే ప్రమాదముంది. అందుకే ఇటీవల పదోతరగతి పరీక్షల్లో తప్పిన విద్యార్థులందరికీ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతుల ద్వారా శిక్షణనిస్తున్నారు.

తాళ్లరేవు మండలంలోని 13 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన 1014 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలకు హాజరు కాగా 298 మంది విద్యార్థులు పరీక్ష తప్పారు. అత్యధికంగా మ్యాథ్స్ పరీక్షలో 186 మంది, తెలుగు పరీక్షలో 159 మంది, సైన్స్ సబ్జెక్ట్‌లో 69 మంది ఫెయిలవ్వడం గమనార్హం. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యాశాఖ ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ సప్లిమెంటరీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. గతంలో కేవలం విద్యార్థుల ఉత్తీర్ణత శాతంపైనే దృష్టి పెట్టేవారు. అయితే విద్యకు అధిక ప్రాధాన్యతనిచ్చే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పరీక్ష తప్పిన విద్యార్థులకు ప్రతి పాఠశాలలోనూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఆయా సబ్జెక్టు టీచర్లతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వచ్చే నెల 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. సదరు పరీక్షల్లో విద్యార్థులు ఉత్తీర్ణులు కాగలిగితే తమ తోటివారితో కలిసి ఇంటర్మీడియట్‌లో చేరడానికి అవకాశమేర్పడుతుంది. పరీక్షలు తప్పిన విద్యార్థులపై ప్రభుత్వం చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధపై తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జూన్ 2 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ జరగనున్నాయి. జూన్ 2వ తేదీన ఫస్ట్ లాంగ్వేజ్, 3న సెకండ్ లాంగ్వేజ్, 5న ఇంగ్లిష్, 6న మ్యాథ్స్, 7న సైన్స్, 8న సోషల్ స్టడీస్, 9, 10 తేదీల్లో మెయిన్ లాంగ్వేజ్ పరీక్షలు జరుగుతాయి. విద్యార్థులు ఈ నెల 7వ తేదీ నుంచి 17వ తేదీ వరకూ ఆలస్య రుసుము లేకుండా పరీక్ష ఫీజు చెల్లించొచ్చు.

విద్యా సంవత్సరం కోల్పోకుండా



పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థి ఏ సబ్జెక్టులో ఫెయిలైతే ఆ సబ్జెక్టు ఉపాధ్యాయునితో పాఠాలు చెప్పించడంతో పాటు ప్రత్యేక టెస్ట్‌లు పెడుతున్నాం. విద్యార్థులు విలువైన విద్యా సంవత్సరాన్ని కోల్పోకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యం.

– మోకా ఉమ, ప్రధానోపాధ్యాయురాలు, జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్, పి.మల్లవరం

విద్యార్థులకు సువర్ణావకాశం



గతంలో ఎన్నడూ లేని విధంగా పరీక్ష తప్పిన విద్యార్థులకు పాఠశాలలోనే తరగతులు నిర్వహించడం సువర్ణావకాశం. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించి బోధన జరుగుతుంది. ఈ అవకాశాన్ని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకుని సప్లిమెంటరీ పరీక్షల్లో పాసవ్వాలి.

– నల్లం సత్యనారాయణమూర్తి, ఉపాధ్యాయుడు, తాళ్లరేవు మండలం

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న మంత్రి పినిపే విశ్వరూప్

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- తుమ్మలపల్లి పంచాయతీలో గడప గడపకూ..

అల్లవరం: ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతంలో ఎన్నడూ లేనన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మంగళవారం మండలంలోని తుమ్మలపల్లి పంచాయతీ పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంత్రి విశ్వరూప్, ఆయన కుమారుడు శ్రీకాంత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుని పరిశీలించడంతో పాటు ప్రజా సమస్యలను తెలుసుకోవడానికే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం లక్ష్యమన్నారు. ఎవరికైనా పథకాలు వర్తించకపోతే గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే ఆరు నెలల్లో మళ్లీ లబ్ధిని చేకూరుస్తారన్నారు. గ్రామ స్థాయిలో సమస్యలు తెలుసుకుని సచివాలయ నిధుల నుంచి ఆయా నిర్మాణ పనులకు నిధులు కేటాయిస్తున్నామని చెప్పారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో ప్రవేశపెట్టిన సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సర్పంచ్‌లు రాయుడు విష్ణు, సాధనాల వెంకటరావు, బర్రే సీతారత్నం, రాకాపు విజయలక్ష్మి, ఎంపీటీసీ పులుసుగంటి రాజేశ్వరి, మాకే కృష్ణమూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, వైఎస్సార్‌సీపీ నాయకులు కాత్రు శాంతికిరణ్, పులుసుగంటి గంగాధర్, పందిరి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలకు మేలు



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- అరటికాయలంకలో గడప గడపకూ మన ప్రభుత్వం

తాళ్లరేవు: ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. మండలంలోని ఇంజరం పంచాయతీలోని అరటికాయలంక గ్రామంలో ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యేకు మహిళలు అడుగడుగునా హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. గత నాలుగేళ్లుగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు పరిష్కారానికి అధికారుల్ని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనపై ప్రజలు ఎంతో సంతృప్తిగా ఉన్నారని, గడప గడపకూ కార్యక్రమానికి వస్తున్న విశేష స్పందనే దీనికి నిదర్శనమన్నారు. ప్రజలు జగనన్నను మళ్లీ సీఎంను చేసేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాద గోవిందకుమార్, రాయుడు గంగాధర్, ఇంజరం సర్పంచ్ ముద్దన వెంకట శివరామ ప్రసాద్, పార్టీ రాష్ట్ర నాయకుడు చింతలపాటి శ్రీనివాసరాజు, ఎంపీటీసీ సభ్యురాలు కోరుకొండ కిరణ్‌కుమారి, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు టిళ్లపూడి నాగేశ్వరరావు, ఇంజరం గ్రామ కమిటీ కన్వీనర్ పెయ్యల కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ గేటు వద్ద ఆందోళన



ఫ్యాక్టరీ గేటు వద్ద ఆందోళన చేస్తున్న సీఐటీయూ నేతలు, కార్మికులు

యానాం: ఇద్దరు కార్మికులను చిత్రహింసలకు గురిచేశారంటూ యానాం నియోజకవర్గ శివారు సీతారామనగర్ అడివిపాలెంలో ఉన్న సీజన్స్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఫ్యాక్టరీ గేటు వద్ద సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళన నిర్వహించారు. స్థానిక కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం కొద్దిరోజుల క్రితం ఒడిశాకు చెందిన ఇద్దరు కార్మికులు ఫ్యాక్టరీలో చేరారు. అయితే అక్కడ పనినచ్చక వెళ్లిపోతామని యాజమాన్యానికి తెలపడంతో వారిని భోజనం సైతం పెట్టకుండా గదిలో ఉంచేశారు. సోమవారం రాత్రి వారిద్దరూ తప్పించుకోవడానికి ప్రయత్నించి ఒకరు ఫ్యాక్టరీ నుంచి పారిపోయారు. మరో కార్మికుడు ముర్ముపై ఫ్యాక్టరీ సిబ్బంది దాడికి పాల్పడడంతో స్థానికులు అడ్డుకుని కాపాడారు. తమకు భోజనం సైతం పెట్టకుండా పది రోజుల పాటు చిత్రహింసలకు గురిచేశారంటూ కార్మికుడు మజాహ ముర్ము సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుర్గాప్రసాద్‌కు తెలియజేశారు. దీంతో తక్షణం యాజమాన్యంపై కేసు నమోదుచేయాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఫ్యాక్టరీ గేటు వద్ద ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో దరియాలతిప్ప గ్రామ పెద్దలు మెల్లం చిన్న, సబ్బతి శ్రీనివాసరావు, మెల్లం నూకాంబరం, కామిరెడ్డి వీరబాబు, పెద్దిరాజు, ఏసు పాల్గొన్నారు.

పెట్రోల్, డీజిల్ రవాణాపై నిబంధనలు పాటించాలి

డీలర్స్‌తో ఆర్‌ఏఓ మునిస్వామి సమావేశం



డీలర్స్‌తో సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఏఓ మునిస్వామి

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలోని వివిధ పెట్రోలియం కంపెనీల డీలర్స్ పెట్రోలు, డీజిల్ రవాణా, పంపిణీపై పుదుచ్చేరి ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఆర్‌ఏఓ మునిస్వామి కోరారు. మంగళవారం ఆర్‌ఏఓ చాంబర్‌లో పెట్రోలియం కంపెనీల డీలర్స్‌తో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరిహద్దున ఉన్న ఆంధ్రప్రదేశ్‌తో పోలిస్తే యానాంలో పెట్రోలియం ఉత్పత్తులపై పన్ను తక్కువగా ఉందన్నారు. దీన్ని ఆసరాగా తీసుకుని ఇతర ప్రాంతాలకు పెట్రోలు, డీజిల్‌ను అధిక స్థాయిలో తరలిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ముందుగా ఇంధనం పంపిణీలో ద్విచక్రవాహనాలకు ప్రాధాన్యమివ్వాలని, అదేవిధంగా వారంలో 24 గంటలూ బంకులు తెరిచే ఉంచాలని, బంకుల వద్ద టాయ్‌లెట్స్‌ను సైతం నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

అమలాపురం టౌన్: స్థానిక నారాయణపేటలో ద్విచక్రవాహనంపై వెళుతున్న వ్యక్తికి ఆవు అడ్డు రావడంతో అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. తీవ్ర గాయాలపాలైన అతడు అపస్మారక స్థితికి చేరుకోవడంతో హుటాహుటీన 108 వాహనంలో స్థానిక ఆసుపత్రికి పంపించారు. ప్రమాదంలో గాయపడిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి విశ్వరూప్



విద్యార్థిని దీప్తి మాధురిని అభినందిస్తున్న సంఘాల ప్రతినిధులు



విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ వరహాలు, హెచ్ఎం వెంకటేశ్వరరావు

అమలాపురం రూరల్: పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన సర్ సీవీ రామన్ స్కూల్ విద్యార్థులను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అభినందించారు. మంగళవారం భట్లపల్లిలోని మంత్రి నివాసంలో విద్యార్థులు మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా 590 మార్కులు సాధించిన ఎం.దీప్తి మాధురి, దంగేటి సాయిప్రవీణ్ (588 మార్కులు), ఉందుర్తి ప్రజ్ఞ (585 మార్కులు), పితాని సాయిలక్ష్మి (585మార్కులు)లను మంత్రి విశ్వరూప్ పుష్పగుచ్ఛంతో అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు, ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

'పది' విజేతలకు సత్కారాలు

అమలాపురం టౌన్: పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల్ని స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘ కార్యాలయంలో మంగళవారం సత్కరించారు. 590 మార్కులు సాధించిన ముదపాక దీప్తి మాధురి, 588 మార్కులు తెచ్చుకున్న దొంతాభక్తుని ఫణిబాల, 582 మార్కులు సాధించిన పెంటపాటి కనకదుర్గ, 569 మార్కులు తెచ్చుకున్న కోసూరి ఐశ్వర్యాంబిక, తమ పాఠశాలలో ప్రథమ స్థానాన్ని సాధించిన శ్రీనూకాంబికలను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు తాతాబత్తుల అప్పలాచార్యులు, విశ్వబ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి ఆవుపాటి వేణుగోపాల్, కార్యదర్శి చోడ్రోలు గంగ నాగేశ్వరరావు, ఒంపోలు పోలరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

అల్లవరం: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన అల్లవరం ఉన్నత పాఠశాల విద్యార్థులకు అభినందన సభ పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించారు. 578 మార్కులతో మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిన వాసంశెట్టి వినయ్‌కుమార్, పాఠశాలలో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన మేడిద జ్యోతిశ్రీసాయి(575), తోరాటి శాంతికిరణ్(555)లను పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ బసవా వరహాలు చేతుల మీదుగా శాలువాలు కప్పి అభినందించారు. అత్యుత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు రూ.30 వేలు నగదు బహుమతులు అందజేశారు. హెచ్ఎం వెంకటేశ్వరరావుని పేరెంట్స్ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు పలువురి పరామర్శ

తాళ్లరేవు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన కోరంగి మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బర్రే లక్ష్మీనరసింహరాజును మంగళవారం పలువురు పరామర్శించారు. ఈ నెల 7వ తేదీన బైక్‌పై కాకినాడ వెళుతుండగా కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి పడిపోవడంతో లక్ష్మీనరసింహరాజుకు గాయాలయ్యాయి. కాకినాడ సిద్ధార్థ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మీనరసింహరాజును టీటీడీ బోర్డు సభ్యుడు మల్లాడి కృష్ణారావు, ఎంపీపీ రాయుడు సునీత, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ తదితరులు పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

కొబ్బరికి స్థిరీకరణ రేటు ప్రకటించాలి

అంబాజీపేట: కోనసీమ రైతుల జీవనాధారమైన కొబ్బరి ధరలు రోజురోజుకూ దిగజారుతున్న నేపథ్యంలో వాటికి స్థిరీకరణ రేటును ప్రకటించి రైతులను ఆదుకోవాలని మాచవరానికి చెందిన శ్రీ ధరణి రైతు సమాఖ్య ప్రభుత్వాన్ని కోరింది. అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయంలో సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు కొర్లపాటి కోటబాబు, నక్కా భాస్కరరావుల ఆధ్వర్యంలో డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ టి.మంగతాయారుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు మట్టపర్తి పరమేశ్వరరావు, పరసా సత్తిబాబు, రవణం హరి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఏఓ మునిస్వామి క్షేత్రస్థాయి పర్యటన



మెట్టకూరులో పర్యటించిన ఆర్‌ఏఓ మునిస్వామి, కమిషనర్ ద్విజ్‌గోయల్

యానాం: నియోజకవర్గ పరిధిలో డ్రెయిన్లు, రహదార్లు నిర్మాణాలపై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై ఆర్‌ఏఓ మునిస్వామి స్పందించారు. మంగళవారం రాజబాబు కోలనీ, మెట్టకూరు తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా డ్రెయినేజీలు లేకపోవడంతో వర్షాల సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, రహదారులు సైతం నిర్మించాలంటూ స్థానికులు కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ద్విజ్‌గోయల్, ఏఈ ఎం.రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్య ఉంటే జగనన్నకు చెబుదాం

ఉప్పలగుప్తం: గ్రామ స్థాయిలో, మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను నేరుగా 1902 నెంబరుకు ఫోన్ చేసి జగనన్నకు చెబుదాం అని సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని విలసవిల్లి పంచాయతీ కార్యాలయంలో వలంటీర్లకు చూపించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, కార్యదర్శి దాసరి కృష్ణాజీ, డీఏ ఎస్.నాగేశ్వరరావు, వీఏ డి.లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ ప్రత్యేక డ్రైవ్

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగరపంచాయతీ పరిధిలోని ఏడు వార్డు సచివాలయ కార్యాలయాల్లో ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ జి.లోవరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10 నుంచి 12 వరకూ మూడు రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నామన్నారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లల ఆధార్ ఎన్‌రోల్‌మెంట్‌కు బిడ్డ పుట్టిన తేదీ ఒరిజినల్ సర్టిఫికెట్, తల్లితండ్రుల ఆధార్ కార్డులు తీసుకెళ్లాలని సూచించారు.

ఇంటర్ స్టేట్ ర్యాంకర్‌కు సత్కారం



ఇంటర్మీడియట్ స్టేట్ ర్యాంకర్ లక్ష్మీనీరజ్‌ను సత్కరించిన దళిత సంఘాల నాయకులు

తాళ్లరేవు: ఇంటర్మీడియట్ ద్వితీయసంవత్సర పరీక్షా ఫలితాల్లో 983 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ఏడో ర్యాంకు సాధించిన చింతా లక్ష్మీనీరజ్‌ను మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఘనంగా సత్కరించారు. మంగళవారం స్థానిక నీలాంధ్రపేట అంబేడ్కర్ స్మారక మందిరంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు కాశి జానకిరాముడు, వెంటపల్లి చంద్రమౌళి, ముంగండ భీమారావు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పఠనం

అమలాపురం రూరల్: విశ్వహిందూ పరిషత్ భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో అమలాపురంలోని హనుమాన్ దేవాలయాల వద్ద మంగళవారం సామూహిక హనుమాన్ చాలీసా పఠనం చేశారు. కార్యక్రమంలో శిరంగునాయుడు, కట్టానారాయణమూర్తి, గుత్తుల త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 67,301 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

ముమ్మిడివరం: జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్‌లో ఇప్పటివరకూ 67,301 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రబీ సీజన్‌లో 2.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాలు కలుపుకుని మొత్తంగా 8628 మంది రైతుల నుంచి 67301 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామన్నారు. కొనుగోలు చేసిన వారం రోజుల్లోపే 6,398 ఎఫ్‌టీఓలకు రూ.23.02 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేశామన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఏమైనా సందేహాలుంటే జిల్లా కార్యాలయం కంట్రోల్ రూం 83094 32487 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని జేసీ తెలిపారు.

గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు

పి.గన్నవరం: పీఎంఎస్ఎంఏలో భాగంగా స్థానిక సీహెచ్‌సీలో మంగళవారం గర్భిణులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెంట్ జీవీ సురేష్, వైద్యాధికారులు 42 మంది గర్భిణులకు వైద్య సేవలు అందించి, మందులు పంపిణీ చేశారు. వై.కొత్తపల్లి గ్రామానికి చెందిన వేణి ఫౌండేషన్ చైర్మన్ నల్లా గంగా ఈశ్వరరావు, సభ్యులు ఫణికుమార్, హరిత, తిక్కిరెడ్డి లక్ష్మి భవానీల ఆధ్వర్యంలో గర్భిణులకు, వారి సహాయకులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఎంపీపీ అంబటి భూలక్ష్మి, ఎంపీడీఓ టీఎస్ వెంకటాచార్య, నాయకులు నల్లా పెదకాపు, తోలేటి దొరబాబు, సుబ్బారావు, రామకృష్ణ పాల్గొన్నారు. అలాగే నాగుల్లంక పీహెచ్‌సీలో వైద్యాధికారి కె.సుబ్బరాజు ఆధ్వర్యంలో 42 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. పాలకొల్లు బోళ్ల వీరాస్వామి సత్రం ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు.